
ప్రజాశక్తి
గురువారం 25 జనవరి 2024
5
పార్వతీపురం మన్యం



నేడు మున్సిపల్ సాధారణ సమావేశం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గురువారం ఉదయం 11 గంటలకు కౌన్సిల్ సాధారణ సమావేశం చైర్ పర్సన్ బోనుగౌరీశ్వరి అధ్యక్షతన జరుగుతుందని కమిషనర్ జె.రామప్పలనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరవుతారని, కావున 30వ వార్డుల కౌన్సిలర్లతో పాటు కార్యాలయంలో ఉన్న పలు విభాగాల అధికారులు హాజరు కావాలని కోరారు.

ఐక్య పోరాటంతోనే విజయం

సహకరించిన, అభ్యుదయవాదులకు, ప్రజాసంఘాలకు కృతజ్ఞతలు : అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

అంగన్వాడీల సమ్మె విజయవంతం కావడానికి కారణం ప్రతికూల పరిస్థితుల్లోనూ ఐకమత్యంగా నిలబడమేనని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు అన్నారు. 42 రోజుల సమ్మె ఫలితంగా ప్రభుత్వం దిగివచ్చి అంగన్వాడీ కార్యకర్తలతో ఒప్పందాలు చేసుకోవడాన్ని చలో విజయవాడ పోరాట ఫలితంగా భావిస్తూ బుధవారం సుందరయ్య భవనం నుంచి నిరసన దీక్షా స్థలమైన కలెక్టరేట్ అవుట్ గేట్ వరకు ఆ సంఘం ఆధ్వర్యంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కేకు కట్ నాయకులు, కార్యకర్తలు ఆటపాటలతో సంబరాలు జరిపారు. అనంతరం యూనియన్ జిల్లా కార్యదర్శి గంట జ్యోతి లక్ష్మి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మధరావు, ఉపాధ్యక్షులు వి.ఇందిర మాట్లాడుతూ 42 రోజులుగా సుదీర్ఘమైన నిరవధిక సమ్మెతో, చలో విజయవాడ ధర్నా పోరాటంతో ప్రభుత్వం దిగివచ్చి సంబంధిత ప్రజాప్రతినిధులతో, యూనియన్ నాయకులు, కార్యకర్తలతో ఆర్థిక, సామాజిక, మానసిక సమస్యల పరిష్కారం కొరకు చర్చించి నిర్దిష్ట హామీలు, జీవోలు అందించడం హర్షించదగ్గ ఫలితమని అన్నారు. ఈ పోరాటంలో అనేక నిర్బంధాలు ఎదురైనా వాటిరి ఎదురొడ్డి ముందున నిలిచిన యూనియన్ కార్యకర్తలకు అభినందనలు తెలిపారు. కొన్ని చోట్ల పోరాట క్రమంలో మరణించిన అమరవీరులకు ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు. పోరాడితే పోయేదేమి లేదు బానిస సంకెళ్ల తప్ప అనే కారల్ మార్క్స్ నినాదానికి సంకేతమే అంగన్వాడీల పోరాట ఫలితమని, ఈ స్ఫూర్తితో భవిష్యత్ పోరాటాలను మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ ఫలితం కేవలం అంగన్వాడీలదే మాత్రం కాదని కొన్ని వేల, లక్షల ప్రజానీకానిదన్నారు. ఈ పోరాటానికి సహకరించిన, మద్దతు తెలిపిన అభ్యుదయవాదులకు, ప్రజాసంఘాలకు, సిఐటియు, వామపక్ష, రాజకీయ పార్టీలకు, మీడియాకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో శ్రామిక మహిళా సంఘం నాయకులు బి.లక్ష్మి, అంగన్వాడీ యూనియన్ పార్వతీపురం సెక్టార్ నాయకులు ఎం.అలివేలు, గౌరీమణి, టి.రాజేశ్వరి, ధర్మవతి, జి.భారతి, లక్ష్మి పలువురు కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.



పట్టణంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు

వైసిపిని విస్మరిస్తే గిరిజనులకు నష్టమే

డిప్యూటీ సిఎం రాజన్నదొర

ప్రజాశక్తి - సాలూరు

రానున్న ఎన్నికల్లో వైసిపిని గెలిపించకపోతే నిరుపేదలైన గిరిజనులే నష్టపోతారని డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర అన్నారు. మండలంలోని తోణాం నుంచి ఎగువ శెంబి వరకు రూ.779 లక్షలతో బిటి రోడ్డు, కురుకుట్టి పంచాయతీ సొంపిగాం సమీపంలో స్వర్ణముఖి నది పై రూ.385 లక్షలతో వంతెన నిర్మాణానికి బుధవారం ఆయన శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సొంపిగాంలో గిరిజనులు డిప్యూటీ సిఎంకు మేళతాళాలతో ఘనస్వాగతం పలికారు. మహిళలు థింసా నృత్యం చేయడంతో రాజన్నదొర వారితో కలిసి నృత్యం చేశారు. అనంతరం నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి పనులకు అధిక ప్రాధాన్యత ఇచ్చినట్లు చెప్పారు. మారుమూల గిరిజన గ్రామాలకు రహదారులు, వంతెనల నిర్మాణానికి చర్యలు చేపట్టినట్లు తెలిపారు. పాచిపెంట మండలంలోని మోసూరు వంతెన నిర్మాణానికి టిడిపి నాయకులు రెండుసార్లు శంకుస్థాపన చేసి వదిలేస్తే తాను నిధులు మంజూరు చేయించి నిర్మించానని చెప్పారు. 14 ఏళ్ల పాటు రాష్ట్రాన్ని పాలించిన టిడిపి ప్రభుత్వం నియోజకవర్గం అభివృద్ధికి ఒక్క రూపాయి కూడా మంజూరు చేయలేదని చెప్పారు. అలాంటి పార్టీకి ఏజెన్సీ ప్రాంతంలో ఓట్లు అడిగే హక్కు ఎక్కడిదని ప్రశ్నించారు. గిరిజన ప్రాంతంలో సంపదను దోచుకోవడం తప్ప అభివృద్ధి పనులు చేయడం టిడిపి నాయకులకు తెలియదన్నారు. 70 గిరిజన కుటుంబాలు వున్న సొంపిగాంకు వంతెన నిర్మాణానికు రూ.3.85 కోట్ల నిధులు మంజూరుకు ప్రభుత్వ నిబంధనలు అడ్డంకిగా ఉన్నాయని, గిరిజనులకు మేలు చేసే ఉద్దేశంతో 1500 కుటుంబాలు వున్న గ్రామమని అబద్ధం చెప్పాల్సి వచ్చిందని చెప్పారు. అభివృద్ధికి దూరంగా ఉన్న ఏజెన్సీ ప్రాంత అభివద్ధికి అబద్ధమాడినా తప్పులేదని భావించానని రాజన్నదొర చెప్పారు. కార్యక్రమంలో ఎఎంసి చైర్‌పర్సన్ దండి అనంతకుమారి, వైస్ఎంపిపిలు రెడ్డి సురేష్, సువ్వాడ గుణవతి, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి దండి శ్రీనివాసరావు, మండల జెసిఎస్ కన్వీనర్ కె.త్రినాధనాయుడు, సర్పంచ్ అప్పారావు, ఎంపిటిసి సభ్యులు గెమ్మెల సుబ్బారావు, సారిక సర్పంచ్ గొర్లి సత్యవతి,కో ఆప్షన్ ఎంపిటిసి సభ్యులు సువార్త రావు, వైసిపి నాయకులు రాంబాబు,గొర్లి రాజారావు పాల్గొన్నారు.


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర



యజ్ఞం చేస్తూ నిరసన తెలుపుతున్న యుటిఎఫ్ నాయకులు

18 వేల కోట్ల బకాయిల కోసం యుటిఎఫ్ యజ్ఞం

ప్రజాశక్తి -కలెక్టరేట్

30శాతం ఐఆర్ కోసం, రూ.18 వేల కోట్ల బకాయి చెల్లించాలని కోరుతూ యుటిఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం కలక్టర్ కార్యాలయం వద్ద యజ్ఞం నిర్వహించారు. ఈ కార్యకమాన్ని ఉద్దేశించి యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.మురళీమోహన రావు మాట్లాడుతూ పిఆర్‌సి కమిటి వేసి 6నెలలు కావస్తున్నా దానికి అతీగతి లేదన్నారు. అందుకే 30శాతం మధ్యంతర భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే ఉద్యోగులు, ఉపాధ్యాయులు దాచుకున్న డబ్బులు సుమారు రూ.18 వేల కోట్లు బకాయిలున్నాయని, వీటిని వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ యజ్ఞం కార్యక్రమం మంత్రాలతో ప్రారంభపై జగన్ నామ స్తోత్రంతో ఉపాధ్యాయులంతా నినాదాలు ఇచ్చారు. బకాయిలు చెల్లించేంత వరకూ ఈ పోరాటం ఆగదని ఉపాధ్యాయులు నినాదాలు ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షులు బి.జ్యోతి, కోశాధికారి కె.మురళి, జిల్లా కార్యదర్శులు ఎన్.శ్రీను, ఎం.పైడిరాజు, పి.వెంకటనాయుడు, వివిధ మండలాల నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ అప్రజాస్వామిక చర్యలను ఖండించండి


పార్వతీపురంరూరల్ : మున్సిపల్ టీచర్ల సమస్యలపై ఇబ్రహీంపట్నం లో డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ కార్యాలయం వద్ద ఈనెల 25న ధర్నా జరుగుతుంది. ఈ కార్యక్రమానికి ముందుగా అనుమతిచ్చి, ఈరోజు రద్దు చేశామని పోలీసులు చెప్పడం అప్రజాస్వామికమని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీ మోహనరావు అన్నారు. ఈ మేరకు బందలుప్పి హైస్కూల్‌కు వచ్చి మురళీ మోహన రావుకు నోటీసు ఇచ్చి మీరు ధర్నాకు వెళ్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పడం ప్రభుత్వ నియతృత్వ ధోరణి అద్దం పడుతుందన్నారు. ధర్నాకు అనుమతి ఇవ్వని సందర్భంగా గురువారం అన్ని మున్సిపల్ కేంద్రాల వద్ద నిరసన ర్యాలీ చేపడుతున్నట్లు తెలిపారు.

పర్యాటక పనులు వేగవంతం : కలెక్టర్

ప్రజాశక్తి - సీతంపేట

ఐటిడిఎ ఆధ్వర్యంలో చేపడుతున్న పర్యాటక ప్రాజెక్టులను వేగవంతం చేసి ప్రారంభించాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ అన్నారు. బుధవారం ఆయన సీతంపేట ఏజెన్సీలో పర్యటించారు. ఈ సందర్భంగా పలు పర్యాటక ప్రాంతాల్లో జరుగుతున్న ఇంజనీరింగ్ పనులను పరిశీలించారు. సీతంపేటలోని పిఎమ్మార్సీ భవనంలో జరుగుతున్న గిరిజన మ్యూజియం పనులను పరిశీలించారు. మ్యూజియంలో ప్రధాన భాగమైన ఆభరణాల ప్రదర్శన, గిరిజన సంస్కృతిని తెలియజేసే కొన్ని భాగాలను తొలుత పూర్తి చేసి పర్యాటకుల సందర్శనకు వీలుగా అందుబాటులో ఉంచాలన్నారు. మ్యూజియంలో చేపడుతున్న రెస్టారెంట్, షాపింగ్ కాంప్లెక్స్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు. అనంతరం ఆడలి వ్యూ పాయింట్ పనులను పరిశీలించారు. పనులపై సంతృప్తి వ్యక్తం చేస్తూ మరింత వేగవంతం చేయాలని అన్నారు. వ్యూ పాయింట్ వద్ద చేపడుతున్న టాయిలెట్స్, రెస్టారెంట్ పనులను పరిశీలించారు. పనుల్లో నాణ్యత లోపించకూడదని సూచించారు. ఆడలి గ్రామం నుంచి వ్యూ పాయింట్ వరకు ఉపాధిహామీ చట్టం ద్వారా రోడ్డు సదుపాయం కల్పిస్తామన్నారు. అదే విధంగా గిరి గ్రామ్ కార్యక్రమం కింద ఒక గిరిజన గ్రామాన్ని ఎంపిక చేసి అభివృద్ధి చేసి ఆ గ్రామాన్ని పర్యాటకులు సందర్శించేలా తయారు చేస్తామన్నారు. ట్రెక్కింగ్ ఏర్పాటుకు గల అవకాశాలను కూడా పరిశీలిస్తామని అన్నారు. అంతకుముందు స్థానిక ఐటిడిఎ ఆధ్వర్యంలో చేపడుతున్న పర్యాటక ప్రాజెక్టుల గురించి ఐటిడిఎ పిఒ కల్పనాకుమారి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్ కు వివరించారు. కార్యక్రమంలో టూరిజం రీజనల్ డైరెక్టర్ పి.శ్రీనివాసరావు, జాయింట్ మేనేజర్ హారేరాం, జిల్లా పర్యాటక అధికారి నారాయణరావు, ఇఇ సింహాచలం, డిఇ కృష్ణకుమార్, ఎఇ నాగభూషన్ ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


ఆడలి వ్యూ పాయింట్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్, ఐటిడిఎ పిఒ కల్పనాకుమారి


శిక్షణలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ గోవిందరావు

ఎన్నికల్లో సెక్టార్ అధికారులు కీలకం

ప్రజాశక్తి -పార్వతీపురం

ఎన్నికల ప్రక్రియలో సెక్టారు అధికారుల విధులు కీలకమని జాయింటు కలెక్టరు ఆర్.గోవిందరావు తెలిపారు. బుధవారం కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో సెక్టారు అధికారులు శిక్షణా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జెసి మాట్లాడుతూ సెక్టారు అధికారులు ఎన్నికల ప్రక్రియలో కీలకంగా వ్యవహరిస్తారని, వారు చేయాల్సిన విధుల గురించి పూర్తి అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. శిక్షణా సమయంలోనే సందేహాలను నివృత్తి చేసుకోవాలని తెలిపారు. ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని, ఎన్నికల కమిషను నియమ, నిబంధనలను పూర్తిగా పాటించాలని తెలిపారు. పోలింగు కేంద్రాల్లో విద్యుత్, మరుగుదొడ్లు, నీరు, ర్యాంపు నిర్మాణాలు, మౌలిక సదుపాయల గురించి ముందుగా తనిఖీ చేసుకోవాలని, ప్రతి పోలింగు కేంద్రంలోనూ మౌళిక సదుపాయాలు ఉండేటలా చూసుకోవాలని తెలిపారు. లోక్‌సభ, శాసనసభలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించనున్నందున సిబ్బంది జాగరూకతతో వ్యవహరించాలని తెలిపారు. ఓటింగు యంత్రాలు పనితీరు, ఎన్నికల సమయంలో సాంకేతిక సమస్యలు గల పరికరాలు మార్చేందుకు గల నిబంధనలు, ఓటింగు ప్రక్రియ, పోలింగు మెటీరియల్ పంపిణీ, పోలింగు అనంతరం మెటీరియల్ తిరిగి తీసుకొనేటప్పుడు పాటించాల్సిన నిబంధనలు గూర్చి పూర్తి శిక్షణ పొందాలని తెలిపారు. కార్యక్రమంలో డిఆర్ఒ జె.వెంకటరావు, కెఆర్‌సి ఎస్‌డిసి జి.కేశవనాయుడు, సెక్టారు అధికారులు పాల్గొన్నారు.

27 నుంచి జగనన్న కాలనీ ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్

పార్వతీపురంరూరల్ : గ్రామ, వార్డు సచివాలయాలను జాయింట్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలుగా గుర్తిస్తూ ఈనెల 27 నుంచి పేదలకు అందించిన ఇళ్ల పట్టాలకు రిజిస్ట్రేషన్లు జరగనున్నాయని జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు తెలిపారు. ఈ నేపథ్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయాల సన్నద్ధతను పరిశీలించే కార్యక్రమంలో భాగంగా బుధవారం పార్వతీపురం తహశీల్దార్ కార్యాలయంను ఆర్‌డిఒ హేమలతతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే ప్రభుత్వం పంచాయతీ కార్యదర్శులు, వార్డు అడ్మినిస్ట్రేషన్ సెక్రటరీలను జాయింట్ సబ్ రిజిస్ట్రార్లుగా గుర్తిస్తూ ఉత్తర్వులు జారీ చేసిందని, వారికి విడతల వారిగా వారి పరిధిలోని రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో శిక్షణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దార్ శివన్నారాయణ, డిటి, వెంకట రమణ,ఆర్ ఐ రామకృష్ణ, విఆర్ఒలు పాల్గొన్నారు.

ఘనంగా పోలమాంబ అనుపోత్సవం

ముగిసిన తొలి జాతర ◆ 30న మారు జాతర

ప్రజాశక్తి - మక్కువ

శంబర పోలమాంబ అమ్మవారి మొదటివారం జాతరకు సంబంధించి ప్రక్రియ బుధవారంతో పూర్తయింది. పోలమాంబ అమ్మవారి అనుపోత్సవాన్ని ఇఒ వివి సూర్యనారాయణ ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. చదురుబడి నుండి అమ్మవారిని వనం గుడిలోకి ప్రవేశపెట్టడంతో మొదటివారం ఉత్సవం ముగిసింది. అమ్మవారిని బుధవారం ఉదయం మేళతాళాల నడుమ చదురు గుడి నుండి సావిడ వీధికి తీసుకొచ్చారు. అక్కడ పూర్వా ఆచారం ప్రకారం ఉయ్యాల కంబాల కార్యక్రమం పూర్తయిన వెంటనే భామాకలాపం అమ్మవారి ముందు ప్రదర్శిస్తూ వనంగుడి వైపు అమ్మవారిని ఘటాలతో నడిపిస్తారు. ఈ సందర్భంగా చాలామంది చిన్నపిల్లలను అమ్మవారి పాదాలకు తగిలేలా నేలపై పడుకోబెట్టి ఆశీర్వాదాలు పొందుతారు. అనంతరం గోముఖి నది దాటిన వెంటనే వనంగుడి వైపు పోలమాంబ అమ్మవారు పరుగు తీస్తారు. పెద్ద ఎత్తున అమ్మవారి వెంట ప్రజలు పరుగులు తీస్తూ వనంగుడి చుట్టూ ప్రదక్షిణలు చేస్తారు. సాంప్రదాయ ప్రకారం అమ్మవారికి బలినార్పించి వనంగుడిలో ప్రవేశపెడతారు. దీంతో మరుసటి ఏడాది వరకు అమ్మవారిని భక్తులు వనంగుడి వద్ద మొక్కులు తీర్చుకుంటారు.

30న మారు జాతర

ఈనెల 30 మంగళవారం వనం గుడి వద్ద మారుజాతర జరగనుంది. అలాగే మిగిలిన వారాల జాతర కూడా ఇక్కడే నిర్వహిస్తారు. అధిక సంఖ్యలో వనంగుడి వద్దకు భక్తులు పాల్గొని పూజలు చేస్తారు. 10 వారాల జాతర అనంతరం మహా చండీ హెూమం చేపట్టి అన్నదాన కార్యక్రమంతో ఈ ఏడాది జాతరకు దేవాదాయ శాఖ ముగింపు పలకనుంది.


వనంగుడికి అమ్మవారి ప్రతిమను తీసుకెళ్తున్న యాత్రికులు

వేలం పాటలు, టికెట్ల ద్వారా ఆదాయం రూ 21.11 లక్షలు

శంబర పోలమాంబ అమ్మవారి జాతర సందర్భంగా దర్శించుకున్న భక్తులు 20 రూపాయ 100 రూపాయల టికెట్లు ద్వారాలు, అలాగే తలనీలాలు, కేశఖండన, కొబ్బరి చిప్పలు, ఇతర దీపాలు. ఫోటోలు వాటి ద్వారా వచ్చే ఆదాయాన్ని దేవాదాయ శాఖ ఇఒ వివి సూర్యనారాయణ బుధవారం వెల్లడించారు. రూ.21లక్షల 11,811 వేల ఎనిమిది వందల ఆదాయం వచ్చినట్టు తెలిపారు. గత ఏడాది కంటే ఈ విభాగాల్లో సుమారుగా రెండు లక్షల పైబడి అధిక ఆదాయం వచ్చిందని తెలిపారు. ఇదిలా ఉండగా దేవాదాయ శాఖ ఈ జాతరకు టికెట్ ధరలను గతం కంటే 100శాతం పెంచిన విషయం తెలిసిందే. అయితే ఈ ఏడాది మొదటి జాతరకు ఆశించిన స్థాయిలో భక్తులు రాకపోవడం, అలాగే ధరలు అధికంగా ఉండడంతో ఎక్కువ మంది భక్తులు ఉచిత దర్శనం క్యూ కట్టడం జరిగింది. దీంతో దేవాదాయ అధికారులు ఇచ్చిన వివరాలు ప్రకారం గత ఏడాదిని పోల్చి చూస్తే ఏడాది శీఘ్ర దర్శనం, ప్రత్యేక దర్శనం టికెట్లకు సుమారు 93,000 వరకు మాత్రమే ఆదాయం పెరిగింది. అలాగే కేశఖండనకు సంబంధించి దాదాపుగా సగానికి ఆదాయం తగ్గింది.

జెఎఎస్ వైద్య సేవలను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - పాలకొండ

జగనన్న ఆరోగ్య సురక్ష-2 వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని జగనన్న ఆరోగ్య సురక్ష-2(అర్బన్) ప్రత్యేక అధికారి ఎం.నారాయణరావు ప్రజలను కోరారు. బుధవారం పట్టణంలోని (అర్బన్) ఇందిరానగర్ కాలనీ సచివాలయంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష-2 వైద్య శిబిరాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష పేరిట ప్రభుత్వం అందిస్తున్న ఈ సేవలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఇందిరానగర్ కాలనీ సచివాలయంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష-2 వైద్య శిబిరంలో 484-ఓపిలు , 280-స్పెషలిస్టు ఓపి, 5-రిఫరల్ కేసులు వచ్చాయన్నారు. లేబ్, మందులు పంపిణీ చేసే కార్యక్రమాన్ని ఆయన సందర్శించి పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ జయ గౌడ్, పట్టణ వైద్యాధికారి కొక్కిరపాటి తేజ్ రతన్ రాజ్, ఆరోగ్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఎస్‌టి కమిషన్ చైర్మన్‌కు మాతృవియోగం


ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

రాష్ట్ర ఎస్.టి.కమిషన్ ఛైర్మన్ డాక్టర్ డివిజి శంకరరావు తల్లి డి.మంగమ్మ(80) బుధవారం విజయనగరంలో మృతి చెందారు. అనారోగ్యంతో స్థానిక ప్రైవేటు ఆసుపత్రిలో చేర్చిన ఆమె మధ్యాహ్నం 4.30 గంటల సమయంలో మృతి చెందినట్టు ఎస్‌టి కమిషన్ క్యాంపు కార్యాలయం ప్రతినిధులు తెలిపారు. ఆమె మృతదేహాన్ని విజయనగరంలోని కామాక్షి నగర్‌లో గల ఎస్.టి.కమిషన్ ఛైర్మన్ శంకరరావు నివాసంలో వుంచారు. గురువారం ఉదయం నగరంలోని కొత్తపేట స్వర్గధామంలో ఆమె అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

నేడు నాలుగో విడత వైఎస్‌ఆర్ ఆసరా అందజేత

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

స్థానిక బి ఎస్ ఆర్ కల్యాణ మండపంలో నాలుగో విడత వైఎస్ఆర్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎపిఎం ఆదయ్య తెలిపారు. ఈ కార్యక్రమానికి కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్ప శ్రీవాణి ముఖ్య అతిథిగా హాజరవుతున్నట్లు ఆయన చెప్పారు. మండలంలోని డ్వాక్రా మహిళలంతా పాల్గొని కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు.


గ్రామంలో విచారణ చేస్తున్న ఆర్‌డిఒ లావణ్య

ఎండియు ఆపరేటర్ ఆత్మహత్యపై ఆర్‌డిఒ దర్యాప్తు

ప్రజాశక్తి - కురుపాం

తన ఆత్మహత్యకు తహశీల్దార్, జిసిఎంఎస్ సేల్స్‌మాన్‌ల ఒత్తిడి కారణం అంటూ మండలంలోని గుమ్మ ఎండియు సీమలో నూకయ్య (36) కుటుంబ సభ్యులు ఆరోపించడంపై స్పందించిన జిల్లా జాయింట్ కలెక్టర్ సమగ్ర దర్యాప్తునకు పాలకొండ ఆర్‌డిఒ ఎం.లావణ్యను ఆదేశించారు. బుధవారం మండలంలోని గుమ్మ పంచాయతీ గదబవలస ఎండియు ఆపరేటర్ స్వగ్రామంలో ఆర్డీవో దర్యాప్తు నిశితంగా చేపట్టారు. ఈ సందర్భంగా నూకయ్య భార్య జ్యోతి, ఇతర కుటుంబ సభ్యులు, గ్రామస్తులు నుంచి వివరాలు సేకరించారు. అనంతరం అధికారులతో దర్యాప్తు నిర్వహించి జాయింట్ కలెక్టర్‌ను నివేదిక సమర్పిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు, గ్రామస్తులు అనాధగా మిగిలిన నూకయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. సేల్స్‌మాన్ జగదీష్ విచారణకు గైర్హాజరు కావడం విశేషం. దీంతో గుమ్మ డిఆర్ డిపో కు వెళ్లి దర్యాప్తు చేపట్టి, నిల్వలు పరిశీలించినట్లు తహశీల్దార్ రమేష్ కుమార్ తెలిపారు. ఎండియు ఆపరేటర్ సరుకులను తీసుకున్న మరో డిపో, లబ్దిదారులతో దర్యాప్తు త్వరలో చేపట్టిన తర్వాత పూర్తి వివరాలు వెల్లడిస్తామని అన్నారు. కార్యక్రమంలో విఆర్ఒ గవరయ్య, సర్పంచ్ గోపాలరావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఆర్థిక చేయూతనిచ్చేందుకే ఆసరా

ప్రజాశక్తి - కురుపాం

మహిళలకు ఆర్థికంగా చేయూతనిచ్చి వారి జీవితాల్లో వెలుగులు నింపేందుకు వైఎస్ఆర్ చేయూత ఆసరా, సున్న వడ్డీ, అమ్మఒడి తదితర సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తుందని ఎమ్మెల్యే పాముల పుష్ప శ్రీవాణి అన్నారు. బుధవారం స్థానిక పెట్రోల్ బంక్ సమీపంలో జరిగిన ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత చంద్రబాబు పాలనలో పొదుపు సంఘాల్లోని అక్కాచెల్లెమ్మలకు రుణాలు మాఫీ చేస్తానంటూ హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చినా చేయకపోవగా, సున్నా వడ్డీ పథకం రద్దు చేయడంతో మహిళలు ఆర్థికంగా చితికిపోయి అప్పుల పాలయ్యారన్నారు. కానీ నేడు వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన మాటకు కట్టుబడి వైఎస్ఆర్ ఆసరా నాలుగో విడత ఆర్థిక సహాయాన్ని అందించిందన్నారు. అనంతరం జగనన్న ఆసరా రూ.3కోట్ల 5లక్షలు, రూ.సున్నా వడ్డీ 2కోట్ల50లక్షలు చెక్కులను గ్రామైక్య సంఘాలకు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా వైసిపి అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు, ఎంపిపి శెట్టి పద్మావతి, జడ్పిటిసి జి.సుజాత, జిల్లా కో ఆప్షన్ సభ్యులు షేక్ నీసార్, వైసిపి గ్రీవెన్స్ జిల్లా అధ్యక్షులు శెట్టి నాగేశ్వరరావు, వైసిపి వాణిజ్య విభాగాల జిల్లా అధ్యక్షులు అందవరపు కోటేశ్వరరావు, మండల కన్వీనర్ ఐ .గౌరీ శంకర్,మేజర్ పంచాయతీ సర్పంచ్ జి .సుజాత ఉప సర్పంచ్ షేక్ ఆదిల్, ఎంపీటీసీలు వి. బంగారు నాయుడు, టీవీఎస్ స్వామి యోజులు, అయ్యర్కల కార్పొరేషన్ డైరెక్టర్ జి .విజయ్ చంద్రశేఖర్, కళింగ వైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కె. సురేష్ కుమార్, ఎంపిడిఒ ఎస్.అప్పారావు, ఎపిఎం ఇవి కిషోర్, వైస్ ఎంపిపిలు అన్నాజీరావు, రంగారావు, వైకెపి సిబ్బంది, విఒఎలు, , మహిళా సంఘాల సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



కరపత్రాలను విడుదల చేస్తున్న యుటిఎఫ్ నాయకులు

'చలో రాజమండ్రి'ని జయప్రదం చేయండి : యుటిఎఫ్

ప్రజాశక్తి - సీతానగరం

ఈనెల 28న రాజమండ్రిలో జరపతలపెట్టిన పాత పెన్షన్ సాధన సభను విజయవంతం చేయాలని యుటిఎఫ్ మండల శాఖ ఉపాధ్యాయులకు పిలుపునిచ్చింది. స్థానిక ఎంఆర్సి ఆవరణలో చలో రాజమండ్రి కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను యుటిఎఫ్ మండల నాయకులు బుధవారం విడుదల చేశారు. అనంతరం జరిగిన కార్యవర్గ సమావేశంలో మండల యుటిఎఫ్ అధ్యక్షప్రధాన కార్యదర్శులు పి.శ్రీనివాసరావు, బి.ప్రసాద రావు మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు హాజరుకావాలని కోరారు. రాజమండ్రిలో జరిగే సమావేశానికి వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు కూడా హాజరై ఓపిఎస్‌పై వారి వైఖరిని తెలియజేస్తున్నందున "ఓట్ ఫర్ ఓపిఎస్" అనే నినాదానికి ప్రాధాన్యత ఏర్పడిందన్నారు. రానున్న ఎన్నికల్లో ఇది ముఖ్యమైన అంశంగా మారుతుందని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యులు ఆర్.శంకరరావు, ఎమ్.గోవిందరావు, మండల మహిళా ఉపాధ్యాయులు కె.లక్ష్మి, మండల కార్యవర్గ సభ్యులు ఎ.పోలినాయుడు, బి.ఆదినారాయణ, కె.మురళి, ఎ.శంకరరావు, బి.సురేష్ కుమార్, ఎన్.శ్రీనాథ్, బలగ ప్రసాద్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మీ సేవలు మరువలేనివి

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండలంలోని తోటపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయంలో గోవింద సేవకుడు తన సేవలు అందించిన గాదారు రామకృష్ణకు బుధవారం నివాళ్లు అర్పించారు. స్వామి వారి ఆలయ అభివృద్ధికి తన శక్తి వంచన లేకుండా కృషి చేసిన రామకృష్ణ జీవితం సార్థకమైందని తోటపల్లి దేవాలయ అభివృద్ధి సేవా ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్ట్ ధనుంజయ్ రావు, ఎగ్జిక్యూటివ్ ట్రస్ట్ డి.పారి పాలినాయుడు, కన్వీనర్ రామచంద్ర మూర్తి అన్నారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు.

'రానున్న ఎన్నికల్లో టిడిపి విజయం ఖాయం'


ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

2024 ఎన్నికల్లో కురుపాం నియోజకవర్గంలో టిడిపి విజయ ఢంకా మోగించడం ఖాయమని సీనియర్ నాయకులు, ఎమ్మెల్యే టికెట్ ఆశావహి బిడ్డిక పద్మావతి అన్నారు. ప్రతి గ్రామంలో టిడిపికి ప్రజల నుంచి ఆదరణ వస్తుందన్నారు. నాలుగున్నరేళ్ల వైసిపి పాలనలో గిరిజనులకు కష్టాలే మిగిలాయన్నారు. గుమ్మలక్ష్మీపురం, కురుపాం ఏజెన్సీ మండలాల్లో గిరిజన యువతకు ఎటువంటి ఉపాధి లేకుండా పోయిందని పేర్కొన్నారు. వైసిపి మూసివేశారన్నారు. ఐటిడిఎ ద్వారా ఏ ఒక్క రుణం కూడా అందే దాఖలాల్లేవన్నారు. నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటి పెరగడంతో గిరిజన ప్రజలు తీవ్ర కష్టాలు పడుతున్నారని తెలిపారు. పండించే పంటలకు కనీసం గిట్టుబాటు ధర లేదన్నారు. రోడ్డు మార్గాలు లేక నేటికీ డోలీ మోతే శరణ్యమవుతుందన్నారు. గిరిజనుల కష్టాలు తీరాలంటే, ప్రతి గ్రామంలో వెలుగులు నిండాలంటే ఈసారి ఎన్నికల్లో నిజమైన గిరిజన అభ్యర్థికి ఎమ్మెల్యే టికెట్ ఇవ్వవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

కోపువలసలో భవిష్యత్తుకు గ్యారంటీ

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని పెద్దరామ పంచాయతీ కోపువలసలో పాలకొండ నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి నిమ్మక జయకృష్ణ ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి బాబు షూరిటీ -భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జయకృష్ణ మాట్లాడుతూ మినీ మేనిఫెస్టోలోని సూపర్ సిక్స్ అంశాలను వివరిస్తూ ఖచ్చితంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా మళ్లీ చంద్రబాబు రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. కార్యక్రమంలో యూనిట్ ఇంచార్జ్ గేదెల కాంతారావు, సవర సుందరరావు, బిడ్డిక భీమయ్య, సవర మల్లయ్య, సవర రాజారావు, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.



బోరు మరమ్మతులు చేయిస్తున్న సర్పంచ్ క్రాంతికుమార్

తాగునీటికి ప్రాధాన్యత

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

తన పంచాయతీలో తాగునీటికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు డుమ్మంగి సర్పంచి పాలక క్రాంతి కుమార్ అన్నారు. డుమ్మంగిలో పాడైన బుధవారం బోర్లకు మరమ్మతులు చేయించారు. రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకొని ముందస్తు చర్యగా ప్రజలకు తాగునీటి సౌకర్యం అందుబాటులో ఉండేందుకు పాడైన బోర్లు గుర్తించి మరమ్మతులు చేస్తున్నట్లు తెలిపారు. రక్షిత మంచినీరు ఎల్లవేళలా ప్రజలకు సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. గ్రామాల్లో ఎప్పటికప్పుడు పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణతో ప్రజలను ఆరోగ్యవంతులుగా ఉంచుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పథకాలపై గిరిజనులకు అవగాహన కల్పించి సద్వినియోగం చేసుకునేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిటిసి కద్రక మల్లేశ్వరరావు, టిడిపి సీనియర్ నాయకులు మండంగి భూషణ ఉన్నారు.



గెడ్డలుప్పిలో పర్యటిస్తున్న టిడిపి నాయకులు విజయచంద్ర

గెడ్డలుప్పిలో టిడిపి పర్యటన

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని గెడ్డలుప్పిలో టిడిపి పార్వతీపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి బోనెల విజయచంద్ర పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలతో గ్రామ సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. సువర్ణముఖీనదిపై అసంపూర్తి నిర్మాణంలో ఉన్న బ్రిడ్జిని సందర్శించి బగ్గందొరవలస, బల్లకృష్ణాపురం, తామరకండీ పెద్దలందరితో మాట్లాడారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు రౌతు వేణుగోపాలనాయుడు, సబ్బాన శ్రీనివాసరావు, రెడ్డి సింహాచలంనాయుడు, సర్పంచ్ మూడడ్ల వెంకటనాయుడు, దాసరి శివున్నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పశు బీమాను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - కురుపాం

రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా పాడి రైతులకు ప్రవేశపెట్టిన పశు బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని పశు వైద్యాధికారి కె.శైలజ అన్నారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ పాడి రైతులు, గొర్రెలు, మేకలు పందుల పెంపకందారులకు ఊరట కలిగిస్తూ కొత్తగా పశుభీమా పథకం లీవ్ స్టాక్ ఇన్సూరెన్స్ పథకం ప్రవేశపెట్టిందన్నారు. గతంలో ఉన్న వైఎస్ఆర్ పశునష్ట పరిహారం పథకం స్థానంలో ఈ పథకాన్ని కొత్తగా ప్రారంభించినట్టు తెలిపారు. మరిన్ని వివరాలకు రైతులు దగ్గరలోని రైతు భరోసా కేంద్రంలో గాని, పశు వైద్యాధికారి ని సంప్రదించాలని సూచించారు.

పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి : పిఒ

ప్రజాశక్తి -పార్వతీపురం



పిఒ విష్ణుచరణ్‌ను సన్మానిస్తున్న నిర్వాహకులు

ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని ఐటిడిఎ పిఒ సి.విష్ణు చరణ్ అన్నారు. బుధవారం స్థానిక గిరిమిత్ర భవనంలో ఏర్పాటు చేసిన ప్రధానమంత్రి విశ్వకర్మ పథకంపై ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అవగాహనా కార్యక్రమం విశాఖకు చెందిన ఎంఎస్ఎంఇ సంచాలకులు డివిఎస్ఆర్ మూర్తి ఆధ్వర్యాన జరిగింది.కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన పిఒ మాట్లాడుతూ వ్యవసాయంపై ఆధారపడడం వల్ల ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భారతదేశమూ ఐదో స్థానంలో ఉందన్నారు. దేశం అభివృద్ధి చెందాలంటే పారిశ్రామికవేత్తలు పెరగాలన్నారు. పరిశ్రమ పెట్టాలంటే మూలధనం అవసరమని, పారిశ్రామికవేత్తలుగా ఎదగడానికి భారత ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తుందని తెలిపారు. ఉద్యోగ, ఉపాధి అవకాశం కలగాలంటే ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని పిఒ సూచించారు. ప్రధానమంత్రి విశ్వకర్మ పథకానికి దరఖాస్తు చేసుకుని ప్రతి ఒక్కరూ పారిశ్రామికవేత్తలు కావాలని పిలుపునిచ్చారు. అర్హత కలిగిన వారికి ప్రభుత్వం మొదటి విడతగా 5 శాతం వడ్డీతో లక్ష రూపాయలు బ్యాంక్ ద్వారా రుణాన్ని అందజేస్తుందని తెలిపారు. తీసుకున్న రుణాన్ని 18 వాయిదాల్లో తిరిగి బ్యాంక్‌లకు చెల్లించాలని, రెండో విడతగా రూ.2 లక్షల రుణాన్ని అందిస్తుందని వివరించారు. పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ కరుణాకర్ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం పనిచేస్తుందన్నారు. 18 రకాల చేతి పనివారు ఉన్నారని, వీరికి ప్రభుత్వం రూ.15వేల విలువైన పనిముట్లను ఉచితంగా అందిస్తుందని తెలిపారు. డిపిఒ బలివాడ సత్యనారాయణ మాట్లాడుతూ అర్హులందరికీ భారత ప్రభుత్వం సాంకేతిక పరిజ్ఞానంతో పాటు ఆర్థిక సాయం కూడా అందించి, పారిశ్రామికవేత్తలుగా ఎదగడానికి తోడ్పాడుతుందన్నారు. జిల్లాలో అర్హత ఉండి ఆర్థికంగా వెనకబడిన వారు సత్వరం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జిల్లాను మాన్యం జిల్లాగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత జిల్లాలోని ఔత్సాహికవేత్తలకు ఉందన్నారు. డిఆర్‌డిఎ ఎపిడి వై.సత్యం నాయుడు మాట్లాడుతూ చేతివృత్తుల వారిని ప్రోత్సహించేలా ఈ పథకం ఉపయోగపడుతుందన్నారు. నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి సాయి కుమార్ మాట్లాడుతూ జిల్లాలో సీతంపేట, గుమ్మపురం, సాలూరు, పార్వతీపురంలలో నాలుగు నైపుణ్యాభివద్ధి శిక్షణా సంస్థలు ఉన్నాయని తెలిపారు.అక్కడ శిక్షణ తీసుకునే వారికీ ఉచితం వసతి భోజనం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రధానమంత్రి విశ్వకర్మ పథకానికి ఎంపికైన వారికి 5 నుండి 7రోజులు శిక్షణా తరగతులు ఉంటాయని పేర్కొన్నారు. ప్రోత్సాహకంగా రోజుకు రూ.500 భారత ప్రభుత్వం చెల్లిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో సిఎస్‌సి ప్రెసిడెంట్ పి.నాగ కుమార్, మహిళలు పాల్గొన్నారు.

అచ్చెప్పవలసలో ఫ్యామిలీ డాక్టర్

వీరఘట్టం : మండలంలోని అచ్చెప్పవలసలో బుధవారం 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక వైద్యాధికారి పి.ఉమామహేశ్వరి వివిధ రకాలైన రోగులకు తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

ఆసరా కాదు.. అక్కచెల్లెళ్లకు టోకరా : టిడిపి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

కల్లిబుల్లి కబుర్లు చెప్పే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆసరా పేరుతో అక్క చెల్లెమ్మలకు టోకరా వేస్తూ మహిళలను నిట్టు నిలువునా మోసగిస్తున్నారని కురుపాం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి తోయక జగదీశ్వరి విమర్శించారు. గుమ్మలక్ష్మీపురంలో తన నివాసం వద్ద విలేకరులతో మాట్లాడారు. కనీస వేతనాలు పెంచాలని వేడుకున్న అంగన్వాడీలపై కక్ష గట్టి ఉక్కు పాదం మోపిన జగన్‌రెడ్డి మహిళలకు ఉద్ధరిస్తాననడం సిగ్గుమాలిన చర్య కాదా ప్రశ్నించారు. డ్వాక్రా సంఘాలను కూకటి వేళ్లతో పెకిలిస్తున్న జగన్ రెడ్డి ఆసరా పేరుతో పొదుపు సంఘాలను ఉద్ధరించేటట్లు మాట్లాడడం దెయ్యాలు వేదాలు వల్లించడం కాక మరేమిటని విమర్శించారు.రాష్ట్రంలో కోటీ 14 లక్షల మంది డ్వాక్రా మహిళలుంటే 79 లక్షల మందికి ఆసరా అంటూ సకాలంలో డ్వాక్రా రుణాలు చెల్లించిన 75 శాతం మందికి టోకరా వేయడం మోసం చేయడం కాదా అన్నారు. చంద్రన్న హయాంలో పొదుపు మహిళలకు సున్నా వడ్డీ ఐదు లక్షల వరకు వర్తింపజేశారని గుర్తు చేశారు. వైసిపి అధికారంలోకి వస్తే పది లక్షల వరకు పెంచుతామని చెప్పిన జగన్మోహన్‌రెడ్డి తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత మూడు లక్షలకే పరిమితం చేశారని ఆమె అన్నారు. టిడిపి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు వరకు రుణమాఫీని పక్కాగా అమలు చేసిందని, 85 లక్షల డ్వాక్రా మహిళలకు మూడు విడతల్లో ఒక్కొక్కరికి పదివేలు చొప్పున రూ.8500 కోట్లు రుణాలు మాఫీ చేశామని, అందరికీ సమన్యాయం చేయాలనే ఉద్దేశంతో పసుపు కుంకుమ పేరుతో 2018-19 లో పదివేల కోట్లు చెల్లించామని, వడ్డీ రాయితీ కింద రూ.2514 కోట్లు చెల్లించమని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో తెలుగు మహిళా అధ్యక్షులు పావని, ఉపాధ్యక్షులు లావణ్య, మహిళా ప్రధాన కార్యదర్శి వెంపటాపు భారతి ఉన్నారు.



అర్జున్ అవార్డు గ్రహీత జయరాంను సన్మానిస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

'ఆడుదాం ఆంధ్ర'ను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - కురుపాం

ఆడదాం ఆంధ్ర క్రీడా పోటీలను ప్రతి క్రీడాకారుడు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పాముల పుష్ప శ్రీవాణి అన్నారు. బుధవారం కురుపాంలో గల సాయిబాబా గుడి ఎదురుగా ఉన్న మైదానంలో నియోజకవర్గస్థాయి ఆడదాం ఆంధ్ర పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారుల ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ క్రీడాకారుల్లో నైపుణ్యతను వెతికి తీసేందుకు ప్రభుత్వం ఆడదాం ఆంధ్ర కార్యక్రమాన్ని ప్రారంభించిందని అన్నారు. ఇది గ్రామస్థాయి నుండి ప్రారంభించి క్రీడాకారులను మండల నియోజకవర్గ జిల్లా జోనల్ స్థాయిలోకి రాష్ట్రస్థాయి నుండి దేశ స్థాయిలోకి ఎదగాలని ముఖ్యమంత్రి ఆశయాన్ని నెరవేర్చాలని కోరారు. అనంతరం కురుపాంకు చెందిన బాక్సింగ్‌లో అర్జున అవార్డు గ్రహీత శీరా జయరాంను సన్మానించారు. కార్యక్రమంలో వైసిపి అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షిత్‌రాజ్, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీ నాయుడు, ఎంపిపిలు శెట్టి పద్మావతి, ఉరిటి రామారావు, జిల్లా కో ఆప్షన్ సభ్యులు షేక్ నిషార్, జడ్పిటిసి జి.సుజాత, వైసిపి గ్రీవెన్స్ జిల్లా అధ్యక్షులు శెట్టి నాగేశ్వరరావు, వాణిజ్య విభాగాల జిల్లా అధ్యక్షులు అంధవరపు కోటేశ్వరరావు, స్థానిక మేజర్ పంచాయతీ సర్పంచ్ జి. సుజాత, ఉప సర్పంచ్ షేక్ ఆదిల్, ఎంపిడిఒలు ఎస్. అప్పారావు, జి.పైడితల్లి ఐదు మండలాల పిడిలు, పిఇటిలు, వైస్ ఎంపిపిలు, ఎంపిటిసిలు, సర్పంచులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఓటే ఫర్ ఒపిఎస్ : యుటిఎఫ్

29న ఐటిడిఎ ఎదుట రాత్రి బస

ప్రజాశక్తి - సీతంపేట

ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఒపిఎస్ విధానం అమలు చేసిన వారికే మద్దతు పలికిన పార్టీకి ఓటు వేస్తామని యుటిఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు ఆరిక భాస్కరరావు పిలుపునిచ్చారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో బుధవారం యుటి ఎఫ్ ప్రాంతీయ సమావేశం మండల అధ్యక్షులు బిడ్డిక పకీరు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా భాస్కరరావు మాట్లాడుతూ ఒపిఎస్ అమలయ్యే వరకు ఐక్యంగా పోరాడుతామని అన్నారు. జిల్లా కార్యదర్శి కుండంగి కృష్ణారావు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 29న సీతంపేట ఐటిడిఎ వద్ద రాత్రి బస చేస్తున్నట్లు అందరూ సహకరించాలని కోరారు. గిరిజన సంఘం సీనియర్ నాయకులు ఎం.తిరుపతిరావు మాట్లాడుతూ జీవో 3ను పునరుద్ధరణ వరకు పోరాడాలని పిలుపునిచ్చారు. ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు తగ్గ నాలుగో తరగతి సిబ్బందిని నియమించారని డిమాండ్ చేశారు. ఆదివాసీ బహుభాష ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర కార్యదర్శి డుంబు మాట్లాడుతూ ఆదివాసి బహుభాష ఉపాధ్యాయులకు సిఆర్టిలు సమానంగా వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ మండల సహ అధ్యక్షులు కొండ గొర్రె సింహాచలం, జిల్లా కౌన్సిలర్ పాలక కష్ణారావు, మండల వ్యవస్థాపకులు హరి నాన, ప్రకాశం జిల్లా నాయకులు బిడ్డిక జయప్రకాష్, జిల్లా మహిళా కన్వీనర్ చంద్రకళ, పాలకల శ్రీనివాసరావు, కె.ఆనందరావు, ఎల్లాంగో తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు భాస్కరరావు

ఘనంగా జాతీయ బాలికల దినోత్సవం



సీతానగరం : జోగింపేటలో బాలికా దినోత్సవంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, బాలికలు

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

జాతీయ బాలికల దినోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా బాలల సంరక్షణ విభాగం, జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జాతీయ బాలికల దినోత్సవం జోగింపేట కేజీబీవీలో జరిగింది. జాతీయ బాలిక దినోత్సవం ప్రాముఖ్యత గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ ఎంఎన్ రాణి బాలల హక్కులు, చట్టాల ప్రాముఖ్యతను వివరించారు. సమాజంలో బాలికలు ఎదుర్కొంటున్న అసమానతల గురించి అవగాహన కల్పించడానికి, ఆడపిల్లల హక్కులు, స్త్రీ విద్య, ఆరోగ్యం, పోషకాహారం ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించడానికి జాతీయ బాలికల దినోత్సవం జరపడం జరుగుతుందన్నారు. బేటీ బచావో బేటీ పడావో, ఆడపిల్లను రక్షించు వంటి భారత ప్రభుత్వ వివిధ ప్రచారాలు, కార్యక్రమాలకు అనుగుణంగా నిర్వహిస్తున్నట్టు చెప్పారు. బాలికల చట్టపరమైన హక్కులు, విద్య, వైద్య సంరక్షణ, వివాహం మొదలైన వాటిపై అవగాహన అవసరమన్నారు. భ్రూణహత్యలు మరొక ప్రధాన సమస్య అని అన్నారు. జిల్లా బాలల సంరక్షణ అధికారి అల్లు సత్యనారాయణ మాట్లాడుతూ మహిళా సంక్షేమ శాఖ తరపున ప్రతి జిల్లాలోనూ దిశా వన్ స్టాప్ సెంటర్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఆడపిల్లలను కాపాడేందుకు ప్రభుత్వం 'సేవ్ ద గర్ల్ చైల్డ్' అనే పథకాన్ని ప్రవేశపెట్టిందని, 14 ఏళ్ల వరకు బాలబాలికలకు ఉచిత, నిర్బంధ విద్య బాలికల విద్యను అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. పోషకాహార లోపం, అధిక నిరక్షరాస్యత, పేదరికం, శిశు మరణాలపై పోరాడేందుకు, గర్భిణీ స్త్రీలందరికీ ప్రసవానంతర సంరక్షణ అవసరమని, బాలికలకు సమాన హక్కులు, అవకాశాలు కల్పించడానికి ప్రభుత్వం అనేక నియమాలను రూపొందించి భవిష్యత్తును మెరుగుపరుస్తుందని అన్నారు. జిల్లా బాలికల అభివృద్ధి అధికారి కె రోజారమణి మాట్లాడుతూ ప్రభుత్వం తరపున నిర్వహిస్తున్న కార్యక్రమాలను వివరించారు. బాలలు ఎటువంటి ఇబ్బంది ఎదురైనా సరే చైల్డ్ లైన్, పోలీసుల సహకారంతో రక్షించవచ్చని అన్నారు. సీతానగరం ఎంఇఒ జి.సూర్యదేవుడు, కెజిబివి ప్రిన్సిపల్ జె.సంధ్య, మహిళా శిశు సంక్షేమ శాఖ జిల్లా నోడల్ ఆఫీసర్ ఎన్.రాజ్యలక్ష్మి, జిల్లా బాలల సంరక్షణ విభాగం పిఒ ఎంఎ నాయుడు, లీగల్ ప్రొవిషన్ ఆఫీసర్ పి.శ్రీధర్, ప్రొడక్షన్ ఆఫీసర్ ఐసి ఎన్.ప్రసాదరావు, కౌన్సిలర్ జి.తవిటినాయుడు, సోషల్ వర్కర్ ఎస్.దేవి, ఒఆర్‌డబ్ల్యు అనిల్‌కుమార్, హరికృష్ణ ఉపాధ్యాయులు, సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

సీతంపేట: మండలంలోని హడ్డు బంగిలో గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాల జాతీయ బాలికల దినోత్సవం ప్రధానోపాధ్యాయులు బి.ఉమావాణి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ బాలికల ప్రాముఖ్యత గురించి వివరించారు. బాలికల హక్కులు, చట్టాల గురించి అవగాహన కల్పించారు. బాలికలు బాగా చదువుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు డిప్యూటీ వార్డెను మల్లి నీరజ తదితరులు పాల్గొన్నారు.

బాలికలు అన్ని రంగాల్లో ముందుండాలి : పిఒ

సీతంపేట : నేటి సమాజంలో బాలికలు అన్ని రంగాల్లో ముందుండాలని ఐటిడిఎ పిఒ కల్పనాకుమారి అన్నారు. బాలికా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ర్యాలీ కార్యక్రమంలో పిఒ పాల్గొన్నారు. బేటీ బచావో బేటీ పడావోపై అవగాహన కల్పించారు. బాలికలు శారీరకంగా, మానసికంగా ధడంగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా స్థానిక సామాజిక భవనం నుంచి అడ్వాంచర్ పార్క్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డిడి అన్నాదొర, డిప్యుటీ డిఇఒ లిల్లీరాణి, ఎఇఒ కోటిబాబు, జిసిడిఒ రాములమ్మ, సిఎంఒ చిరంజీవులు ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వీరఘట్టం : మండలంలోని జాతీయ బాలికల వారోత్సవాలు వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్తు బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులచే ర్యాలీ నిర్వహించారు. ఆడపిల్లలను రక్షిద్దాం అంటూ విద్యార్థులు నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సిడిపిఒ బి.సిమ్మలమ్మ, సూపర్వైజర్ ఎన్.రాజేశ్వరి, ప్రధాన ఉపాధ్యాయులు కెపి నాగమణి, అంగన్వాడీ కార్యకర్తలు, విద్యార్థులు, పాల్గొన్నారు.

సీతానగరం : మండలంలోని జోగింపేటలో కెజిబివి పాఠశాలలో ఐసిడిఎస్ పీడీ ఎంవి రాణి ఆధ్వర్యాన జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి బాలిక తనకు తానే ఒక ఆయుధంగా మారాలని, నేర్చుకొనే ప్రతి అక్షరాన్ని పదునుగా మలుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిసిపిఒ సత్యనారాయణ, ఎంఇఒలు సూరిదేముడు, ఎం.వెంకటరమణ, జిసిడిఒ రోజారమణి, కెజిబివి ప్రిన్సిపల్ జొన్నాడ సంధ్య, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



సీతంపేట : హడ్డుబంగిలో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

గుమ్మలక్ష్మీపురం : ఉమెన్స్ ఎంపవర్ మెంట్ సెల్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ బాలిక దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతి ప్రధానం చేశారు. బాలికలు అన్ని రంగాల్లో పాల్గొని రాణిస్తున్నారని వక్తలు పేర్కొన్నారు. ప్రభుత్వాలు బాలికలకు కల్పించిన అన్ని అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని, బాగా చదివి ఉన్నత స్థాయిలో ఉండాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ టి.శ్రీవరం, కన్వీనర్ డి.శ్రీలక్ష్మి, అధ్యాపకులు పాల్గొన్నారు.

పాచిపెంట : జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా బుధవారం స్థానిక గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల వద్ద ఐసిడిఎస్ సిడిపిఒ బిఅనంతలక్ష్మి ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. బాలికలను రక్షిద్దాం బాలికలను చదివిద్దాం అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం, హెచ్‌డబ్ల్యుఒ స్వర్ణలత, అంగన్వాడీ సూపర్వైజర్లు, కార్యకర్తలు, పాఠశాల బాలికలు పాల్గొన్నారు.

భూపట్టాలు మంజూరు చేయాలి

ప్రజాశక్తి - పాచిపెంట

సాలూరు, మక్కువ, పాచిపెంట మండలాల పరిధిలో 13,500ఎకరాల అన్‌సర్వేడ్ భూములున్నాయని, వెంటనే ఈ భూములను సర్వే చేసి అర్హులైన గిరిజనులకు పట్టాలు మంజూరు చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కోరాడ ఈశ్వరరావు డిమాండ్ చేశారు. మండలంలోని కుడుమూరు మెట్టగుడ్డి వద్ద ఆదివాసీ గిరిజన సంఘం మండల అధ్యక్షులు సూకురు అప్పలస్వామి అధ్యక్షతన బుధవారం విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఈశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా పోరాడి సాధించుకున్న గిరిజన చట్టాలు నిర్వీర్యమవుతున్నాయని, దీని కారణంగా నేటికీ గిరిజన ప్రాంతాల్లో రహదారుల్లేక విద్య, వైద్యానికి దూరమవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తుమరవెల్లి, సిట్టిపురం ప్రాంతాల్లో ఆంధ్రా జమీందారుల పేరుతో గిరిజనులు మోసపోతున్నారని నేటికీ ఆ భూములకు పట్టాలు ఇవ్వటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా గిరిజనులు సాగు చేస్తున్న భూములు అన్నింటికీ పూర్తిస్థాయిలో పట్టాలు మంజూరు చేసి గిరిజన భూములకు రక్షణ కల్పించాలని అన్నారు. ఆదివాసీ గిరిజన సంఘం మండల అధ్యక్షులు సూకురు అప్పలస్వామి మాట్లాడుతూ కుడుమూరు సర్వే నెంబరు 48లో భూములు సర్వేలు చేసి ఏడాదైనా హక్కులు కల్పించకపోవడం దారుణమన్నారు. హక్కులు లేని కారణంగా ఉపాధి హామీ పనులు కూడా ఇవ్వడం లేదని అధికారులు ప్రభుత్వం కాలయాపన చేస్తూ నేటికీ హక్కులు కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి గిరిజన భూములకు హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు.

సాలూరురూరల్ : సర్వే చేసిన భూమును రైతులకు పట్టాలు వెంటనే పంపిణీ చేయాలని సిపిఎం మండల నాయకులు కోరారు. బుధవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిపిఎం మండల కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజా సంఘాల పోరాట ఫలితంగా మండలంలోని అటవీ బంజరు భూములను సర్వే చేశారని, అయితే ఏళ్లు గడుస్తున్నా నేటికీ పూర్తిస్థాయిలో పట్టాలు పంపిణీ చేయడం లేదని అన్నారు. అటవీ పట్టాలు సిద్ధం చేసి అధికారులు తమ వద్ద ఉంచుకొని మండలంలోని గిరిజన రైతులను ఏళ్ల తరబడి తమ చుట్టూ తిప్పుకుంటున్నారని తెలిపారు ఇప్పటికైనా తయారైన పట్టాలు వెంటనే పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే అనేక సందర్భాల్లో గిరిజన పేదలు పట్టాల పంపిణీ చేయండని అడుగుతున్న నేటికీ సమస్య పరిష్కరించకుండా కాలయాపన చేస్తున్నారని, అడిగిన వారిపై బెదిరింపులకు దిగుతున్నారని ఇది సరైనది కాదని తెలిపారు. ఒకే ప్రాంతంలో సాగు చేస్తున్న బోర్రపనుకు వలస, జిల్లేడు వలస, గాదిల వలస గ్రామ గిరిజనులకు ఒకేసారి పట్టాలు పంపిణీ చేస్తామని పోరాట కాలంలో హామీ ఇచ్చి ఇటీవల కాలంలో ఒక్క గాదిలవలస గ్రామ గిరిజనులకు మాత్రమే పట్టాలు పంపిణీ చేసి మిగిలిన రెండు గ్రామాలకు పంపిణీ చేయకుండా అన్యాయం చేశారని తెలిపారు. వెంటనే సిద్ధంగా ఉన్న పట్టాలు పంపిణీ చేయాలని, లేకుంటే గిరిజనులను ఐక్యం చేసి పోరాటం చేస్తామని తెలిపారు. విలేకరుల సమావేశంలో మండల కమిటీ సభ్యులు కూనేటి చినబాబు గేమ్మల జానకిరావు సుకురు గంగయ్య తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు కోరాడ ఈశ్వరరావు

సిటియుపై శ్రద్ధ చూపని ప్రభుత్వాలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

రాష్ట్ర విభజన చట్టం ప్రకారం ఏర్పాటు చేసిన ట్రైబల్ సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ విజయనగరంలో ఏర్పడి సుమారు నాలుగేళ్లు కావస్తున్నా నేటికీ పూర్తి స్థాయి అభివృద్ధికి నోచుకోలేదని ట్రైబల్ రైట్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు రోబ్బా లోవరాజు అన్నారు. యూనివర్సిటీ ఏర్పాటు చేసిన నాలుగేళ్లు గడుస్తున్న నేటికీ అరకొర వసతులతోనే నెట్టుకొస్తున్నారని తెలిపారు. అధ్యాపక పోస్టుల్లో 80 శాతం ఖాళీలు భర్తీ చేయలేదని, దీనిపై ఎన్నిసార్లు ప్రశ్నించినా ఏమాత్రం పట్టని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలుంటే పేద గిరిజనుల విద్యార్థులకు విద్య కలగానే మిగిలిపోతుందన్నారు. గిరిజనులకు ప్రత్యేక రిజర్వేషన్ కల్పించాలని, నూతన ఉపాధి కల్పనా కోర్సులు ప్రవేశ పెట్టాలని, హాస్టల్ వసతి, ల్యాబ్‌లు, లైబ్రరీ, మౌలిక వసతులను తక్షణమే కల్పించాలని, టీచింగ్ పోస్టులకు 50 శాతం, నాన్ టీచింగ్ పోస్టులు 100 శాతం గిరిజనులతో భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

సచివాలయాలతో ప్రజల చెంతకు పథకాలు

ప్రజాశక్తి కొమరాడ

వైసిపి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రజల చెంతకు సంక్షేమ పథకాలు అందజేసేందుకు సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి మరింత బలోపేతం చేసేలాచర్యలు చేపడుతుందని స్థానిక ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అన్నారు. మండలంలోని కళ్లికోట గుణానపురంలో కొత్తగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనాలను బుధవారం ఆమె ప్రారంభించారు. అనంతరం సచివాలయ భవనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు అన్ని సేవలు సక్రమంగా అందిస్తున్నట్టు తెలిపారు. ఏ చిన్న పనైనా సచివాలయానికి వెళ్తే తక్షణమే పరిష్కారమయ్యేలా అక్కడ సిబ్బంది ఉద్యోగులు పనిచేస్తున్నారని అన్నారు. రేషన్ బియ్యం నుంచి సర్టిఫికెట్లు, వివిధ పథకాలు అందజేతకు వాలంటీర్లు కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. ఈ సేవలను చూడలేని టిడిపి వైసిపిపై బురద చల్లే ప్రక్రియకు పని కట్టుకొని ప్రభుత్వంపై విమర్శలు చేయడం సరికాదన్నారు. అనంతరం జలజీవిని మిషన్ పథకం ద్వారా ఇంటింటికి మంచినీటి కొళాయిలను ప్రారంభించారు. కార్యక్రమంలో జడ్పిటిసి సభ్యులు డి.లక్ష్మి, ఎంపిపి శెట్టి శ్యామల, ఎంపిడిఒ మల్లికార్జునరావు, తహశీల్దార్ భుజంగరావు, మాజీ డిసిఎంఎస్ వైస్ చైర్మన్ కళింగ మల్లేశ్వరరావు, వైసిపి నాయకులు జనార్ధనరావు. మధుసూదన్ రావు, శివుని పిఎసిఎస్ అధ్యక్షులు గోపాలకష్ణ, పైల వెంకటరమణ, ముత్యాలు, సర్పంచి మురళి, సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్‌టిసి డ్రైవర్ల ర్యాలీ

ప్రజాశక్తి - సాలూరు

హేపీ డ్రైవర్స్ డే సందర్భంగా బుధవారం స్థానిక ఆర్టీసీ డిపో డ్రైవర్లు పట్టణ ప్రధాన రహదారిపై ర్యాలీ నిర్వహించారు. డిఎం భాస్కరరెడ్డి, డిపో యూనియన్ నాయకులు ఎంఎస్ నారాయణ, ఎటి నాయుడు ఆధ్వర్యాన స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి బోసుబొమ్మ జంక్షన్ వరకు ర్యాలీ చేపట్టారు. పట్టణ సిఐ జిడి బాబు మాట్లాడుతూ ఆర్టీసీ బస్సు ల్లో ప్రయాణం వల్ల సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవచ్చునని చెప్పారు. నిష్ణాతులైన డ్రైవర్లులు ఆర్టీసీలో ఉన్నందున బస్సుల్లో ప్రయాణం పేద, మధ్యతరగతి ప్రజలకు ప్రయోజనకరమని చెప్పారు. ఈ కార్యక్రమంలో టౌన్ ఎస్ఐ కెవి సురేష్, ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

పాలకొండ: ఆర్టీసీ డ్రైవర్లు నిజమైన సమాజ సేవకులని స్థానిక ఆర్టీసీ డిపో మేనేజర్ పట్టణాల వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం డ్రైవర్స్ డే సందర్భంగా డిపో మేనేజర్ ఆధ్వర్యంలో డిపో నుండి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో జరిగిన బహిరంగసభలో ఆయన మాట్లాడుతూ డ్రైవర్ సోదరుల పనితనం చాలా గొప్పదని, అలాగే మరింత బాధ్యతతో రోడ్డు భద్రతను పాటించాలన్నారు. సంస్థ ఉద్యోగులకు సహకరించాలని అన్నారు. కాంప్లెక్స్ ఆవరణలో ఉన్న విద్యార్థులతో డ్రైవర్లకు గులాబీ పువ్వులు ఇప్పించి డ్రైవర్స్ డే శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ సిస్టు లక్ష్మణరావు, మెకానికల్ ఎఇ ఎంకెఎం రాజు, హెడ్ క్లర్క్ నాయుడు, సెక్యూరిటి హెచ్‌సి రాంబాబు, ఉద్యోగులు పాల్గొన్నారు.